సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
బుధవారం | 12 | జులై | 2023





తెలంగాణ అభివృద్ధిలో ఎన్ఆర్ఐలు కీలకం

రాష్ట్ర అభివృద్ధిలో ఎన్ఆర్ఐలు కీలకమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు.

- 8లో



నవాబ్ అలీ సేవలు చిరస్మరణీయం

ఇంజనీర్ నవాబ్ అలీ సేవలు చిరస్మరణీయమని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు అన్నారు.

- 8లో

గరిష్టం/కనిష్టం
$33^0$ / $25^0$

వాతావరణం

జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉండి, పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### దరఖాస్తు చేయాలి

భూపాలపల్లి అర్బన్: ఇన్‌స్పైర్ మానక్‌కు ప్రతి పాఠశాల నుంచి దరఖాస్తు చేయాలని అకాడమిక్ అధికారి లక్ష్మణ్ కోరారు. జిల్లాకేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో మంగళవారం ఇన్‌స్పైర్ మానక్‌పై జిల్లా సైన్స్ అధికారి స్వామి అధ్యక్షతన సైన్స్ ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రతి పాఠశాల నుంచి తప్పనిసరిగా ఐదు ప్రాజెక్ట్‌లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవాలన్నారు.

### చర్యలు తీసుకోవాలి



భూపాలపల్లి రూరల్: నిధులు దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేనా నాయకులు మంగళవారం కలెక్టర్ భవేష్‌మిశ్రాకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలోని గిరిజన ఆశ్రమ హాస్టళ్లలో నాణ్యత లేకుండా మరమ్మతు పనులు జరుగుతున్నాయన్నారు. కాంట్రాక్టర్లు అధికారులతో కుమ్మక్కై నిధులు దుర్వినియోగం చేస్తున్నారని చెప్పారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు భూక్యా సురేష్‌నాయక్, మహిళా జిల్లా అధ్యక్షురాలు ధారావత్ శారద బాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు వాలు నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ మధుకర్ నాయక్, ఉపాధ్యక్షురాలు పద్మబాయి, ప్రధాన కార్యదర్శి కీర్తిబాయి, జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ నాయక్, చిట్యాల, మల్హర్, కాటారం మండల అధ్యక్షులు రాజు నాయక్, రవీందర్ నాయక్, ప్రకాశ్‌నాయక్ పాల్గొన్నారు .

### ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యం



ములుగు: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి సమష్టిగా పనిచేయాలని ఎస్పీ గాష్‌ఆలం అధికారులకు సూచించారు. ములుగు జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఏఎస్పీలు, సీఐలతో ఎన్నికల భద్రతపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు అనుగుణంగా ఇంకా మెరుగ్గా ఎన్నికలు నిర్వహించేలా ప్రణాళికను రూపొందించారు. ఇందులో భాగంగా గత ఎన్నికల సమయంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో జరిగిన అవాంఛనీయ సంఘటనలు, క్రిటికల్ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలు పరిశీలించారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గత ఎన్నికల డేటా ను తెప్పించుకొని రాబోయే ఎన్నికలకు సంబంధించిన పనులపై చర్చించారు. 2018, 2019 ఎన్నికల సమయంలో నమోదైన నేరాల జాబితాను అధికారులతో తెప్పించుకొని ఎస్పీ పరిశీలించారు. భౌతికంగా పోలింగ్ స్టేషన్లను అధికారులు సందర్శించి వాటి స్థితిగతులను తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఓఎస్డీ అశోక్ కుమార్, ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, అదనపు ఎస్పీ సదానందం, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీఐలు రంజిత్, శంకర్, రాజు, ఆర్ఐఎంటీఓ కిరణ్, ఎస్సైలు తాజుద్దీన్, తిరుపతిరావు, కరుణాకర్, వెంకటేశ్వర్లు, హరీశ్, సురేష్, కృష్ణప్రసాద్, ములుగు సెకండ్ ఎస్సై లకోష్మిరెడ్డి పాల్గొన్నారు.

### పారా సెంటర్ నిర్వహణకు దరఖాస్తుల స్వీకరణ

వరంగల్ స్పోర్ట్స్ : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాలతో హనుమకొండ జిల్లాలో ఖేలో ఇండియా పారా సెంటర్ నిర్వహణకు సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్ఓ జి.అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్చరీ, రోలార్ స్కేటింగ్, రోయింగ్, సాఫ్ట్‌బాల్, టెన్నిస్, వాలీబాల్, టెన్‌పిన్ బౌలింగ్, రెజ్లింగ్, ఉషు, యోగాసన క్రీడాంశాల నుంచి ఒక్క క్రీడకు సంబంధించిన ఖేలో ఇండియా పారా సెంటర్‌ను మాత్రమే గుర్తించనున్నట్లు పేర్కొన్నారు. 40 సంవత్సరాల వయస్సు లోపు ఉండి, వ్యక్తిగత క్రీడల్లో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ఉండాలని, సీనియర్ నేషనల్స్, ఖేలో ఇండియా పోటీల్లో పతకాలు సాధించిన వారు, టీం క్రీడల్లో అంతర్జాతీయ కాంపిటీషన్‌లో పాల్గొని, గుర్తింపు గల ఎన్ఎస్ఎఫ్ అసోసియేషన్ పక్షాన ఆడిన వారు, సీనియర్ నేషనల్స్ ఖేలో ఇండియా గేమ్స్‌లో పతకాలు సాధించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. అర్హత కలిగి, జిల్లాకు చెందిన సీనియర్ క్రీడాకారులు ఈనెల 19వ తేదీలోగా డీవైఎస్ఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

# డెంగీ భయం

ఈ ఏడాదిలో 13కేసులు నమోదు

- కట్టడికి వైద్యారోగ్య శాఖ చర్యలు
- వ్యాధుల కాలం జాగ్రత్తలు అవసరం



ఐదేళ్లలో జిల్లాలో నమోదైన కేసులు

| వ్యాధి | 2019 | 2020 | 2021 | 2022 | 2023 |
|---|---|---|---|---|---|
| డెంగీ | 27 | 07 | 11 | 19 | 13 |
| మలేరియా | 18 | 56 | 58 | 24 | 00 |

పీహెచ్‌సీల వారీగా డెంగీ కేసులు

| | |
|---|---|
| అంబటిపల్లి | 3 |
| భూపాలపల్లి | 2 |
| చెల్పూర్ | 1 |
| కాటారం | 3 |
| మహాముత్తారం | 1 |
| మొగుళ్లపల్లి | 1 |
| రేగొండ | 2 |

భూపాలపల్లి అర్బన్: వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో జిల్లాలో జ్వరాలు ప్రారంభమయ్యాయి. దోమలు వ్యాప్తిచెందడంతో డెంగీ, మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 13 డెంగీ కేసులు నమోదయ్యాయి. దీంతో సీజనల్ వ్యాధుల నియంత్రణకు జిల్లా వైద్యారోగ్య శాఖ ప్రణాళికలను రూపొందించింది. వర్షాకాలం నేపథ్యంలో జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలో దోమలతో వివిధ రకాలు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న దృష్ట్యా వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతీ పీహెచ్‌సీ పరిధిలో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేశారు.

జిల్లాలోని 242 గ్రామపంచాయతీల్లో దోమల నివారణ, వ్యాధులు ప్రబలితే సత్వరమే స్పందించి బాధితులకు తగిన చికిత్సను అందించేలా వైద్యారోగ్య శాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. పరిసరాలు పరిశుభ్రతలో భాగంగా గ్రామ కార్యదర్శి, ఆశ కార్యకర్తలను, స్థానిక వైద్యాధికారి, అంగన్‌వాడీ కార్యకర్త, సబ్ సెంటర్ల పరిధిలోని ఇద్దరు చొప్పున ఏఎన్ఎంలను ఆరోగ్య కార్యకర్తలు, పీహెచ్‌సీల స్థాయిలో సూపర్‌వైజర్లను అప్రమత్తం చేశారు. కేసుల నమోదు మేరకు పరసర ప్రాంతాల్లో ప్రజల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలను నిర్వహించేలా సిద్ధం చేశారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతిలో భాగంగా ఇటీవల జిల్లాలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచారు.

**మలేరియా కేసులే అధికం..**

నిలిచి ఉన్న నీరు, అపరిశుభ్ర వాతావరణంతో దోమలు వ్యాప్తి చెంది జనానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు డెంగీ కేసులు 11 నమోదుకాగా.. మలేరియా కేసులు మాత్రం ఒక్కటి కూడా రాలేదు. కరోనా నేపథ్యంలో పరిశుభ్రత పెరగడంతో రెండేళ్లుగా కేసులు తీవ్రత తగ్గుముఖం పట్టింది.



వైద్యాధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీచేస్తున్న డీఎంహెచ్ఓ శ్రీరామ్

**డెంగీ పట్ల అప్రమత్తత అవసరం..**

డెంగీ నిర్ధారణలో హిమోగ్రామ్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. పీహెచ్‌సీల వారీగా సేకరించిన నమూనాలను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డయాగ్నొస్టిక్ కేంద్రానికి పంపిస్తున్నారు. ఫలితాలకు అనుగుణంగా చికిత్సలు చేస్తున్నారు. గతేడాది 8,842 శాంపిళ్లు సేకరించి డెంగీ పరీక్షలు నిర్వహించగా 19 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది 1,450 శాంపిళ్లను ఇప్పటికే సేకరించగా 13కేసులు నమోదయ్యాయి.

### పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి..



వర్షాకాలం వ్యాధులు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వివిధ రకాల దోమలు, కీటకాలతో వ్యాధులు ప్రబలుతుంటాయి. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. దోమలు పుట్టకుండా.. కుట్టకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. నీరు నిల్వ ఉండేందుకు అవకాశం లేకుండా చూసుకోవాలి. అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను సంప్రదించాలి.

- శ్రీరామ్, ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ

## మారిన గ్రామాల రూపురేఖలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామాల రూపురేఖలు మారిపోయాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. వరంగల్ జెడ్పీ చైర్పర్సన్ గండ్ర జ్యోతితో కలిసి వెంకటరమణారెడ్డి మంగళవారం మండలంలోని గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఆజంనగర్‌లో చెన్నకేశవస్వామి ఆలయంలో ఎమ్మెల్యే గండ్ర దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆజంనగర్‌లో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే గండ్ర మాట్లాడారు. రైతులు చాలారోజులుగా ఎదురుచూస్తున్న పెగడపల్లి రోడ్డు పనులకు శంకుస్థాపన చేయటం చాలా సంతోషమన్నారు. రోడ్డుతో రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కేవలం మూడు గంటల విద్యుత్ ఇస్తామని రేవంత్ రెడ్డి చెప్పటం సిగ్గుచేటన్నారు. ఈ ప్రాంతంలో కొంతమందికి పట్టాలు రాలేదని తన దృష్టికి వచ్చిందని అతికొద్ది రోజులలోనే కలెక్టర్, అధికారులతో మాట్లాడి పట్టాలిప్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభ రఘుపతిరావు ఎంపీపీ మండల లావణ్య సాగర్ రెడ్డి, జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్, ఆజంనగర్ సర్పంచ్ గోవిందుల రాజక్క, ఎంపీటీసీ జంగా సునీత, పార్టీ మండల అధ్యక్షుడు పిన్ రెడ్డి రాజిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు తుమ్మేటి రవీందర్ రెడ్డి, సర్పంచ్‌లు ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## కుటుంబ నియంత్రణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి, పక్కన డీఎంహెచ్ఓ

భూపాలపల్లి అర్బన్: కుటుంబ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలోని ప్రగతి భవనంలో మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీదేవి అధ్యక్షతన ఏర్పాటుచేయగా డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరామ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ, కాన్పులపై నూతన దంపతులకు గర్భ నిరోధన, శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కాపర్-టీ ద్వారా దీర్ఘకాలికంగా గర్భ నిరోధన చేయవచ్చని తెలిపారు. ప్రతి నెలా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి మాట్లాడుతూ కుటుంబ నియంత్రణపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. కుటుంబ నియంత్రణలో ఉత్తమ సేవలు అందించిన వైద్యాధికారులు, సిబ్బందికి అవార్డులు అందజేశారు. ఒకే కాన్పుతో కుటుంబ నియంత్రణ అపరేషన్ చేసుకున్న మహిళలకు నగదు ప్రోత్సహకాలు అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కొమురయ్య, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఉమాదేవి, అన్వేషిని, డీపీహెచ్ఎంఓ వెంకటమ్మ, డెమో శ్రీదేవి పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

భూపాలపల్లి రూరల్: మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలు, పెండింగ్ బిల్లులు, చెల్లించే వరకూ సమ్మె కొనసాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న నిరవధిక సమ్మె మంగళవారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ వేతనాలు పెంచుతూ జీఓ విడుదల చేసి ఐదు నెలలు అవుతున్నా ఇప్పటి వరకు అమలు కావడం లేదన్నారు. వేతనాలు వెంటనే పెంచి తొమ్మిది నెలల పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొరిమి సుగుణ, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల శ్రీకాంత్, నాయకులు మెరుగు రమేష్, కడారి భవాని, భాగ్య, పద్మ, భానుమతి, సుగుణమ్మ పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: రైతులకు 24గంటల కరెంట్ వద్దు.. మూడు గంటలు చాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. భూపాలపల్లి పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్ధు, బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయానికి కేవలం ఏడు గంటలు మాత్రమే కరెంటు ఇచ్చేవారని.. దానివల్ల రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. రాత్రులు పాము కాటుతో, కరెంట్ షాక్‌తో రైతులు మృతిచెందారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ బదితల సమ్మయ్య, కౌన్సిలర్లు, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు కరీం, జిల్లా నాయకులు పైడిపల్లి రమేష్, సాంబమూర్తి, రాజిరెడ్డి యూత్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## శభాష్ పోలీస్



టేకుమట్ల: కల్వర్టు వద్ద శ్రమదానం చేస్తున్న ఏఎస్సై ఇంతియాజుద్దీన్



కాళేశ్వరం: రోడ్డుకు అడ్డంగా పడ్డ చెట్టును తొలగిస్తున్న ఎస్సై, పోలీసులు

టేకుమట్ల: టేకుమట్ల పోలీస్‌స్టేషన్ ఎదురుగా టేకుమట్ల-ఆశిరెడ్డిపల్లి ప్రధాన రోడ్డు వెంట కల్వర్టును రెండు సంవత్సరాల క్రితం నిర్మించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో కల్వర్టుకు ముందు, వెనకాల కంకరతో సరిగా పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారింది. వాహదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో స్పందించిన పోలీసులు ఎస్సై చల్ల రాజు ఆదేశాల మేరకు ఏఎస్సై ఇంతియాజుద్దీన్, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు మధుకర్, మహేందర్ కల్వర్టు వద్ద శ్రమదానం చేసి వాహనదారుల ఇబ్బందులను తాత్కాలికంగా తొలగించారు. ఈ సందర్భంగా పోలీసులను పలువురు అభినందించారు.

**తెల్లవారుజామున..**

కాళేశ్వరం: వర్షానికి మంగళవారం తెల్లవారుజామున చెట్టువిరిగి కాళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై పడింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఈ విషయం తెలుసుకున్న కాళేశ్వరం ఎస్సై జె.లక్ష్మణ్‌రావు, సిబ్బందితో వెళ్లి చెట్టును తొలగించారు. తెలంగాణ-మహారాష్ట్రకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా త్వరగా రోడ్డు క్లియర్ చేశారు. దీంతో శభాష్ పోలీస్ అంటూ పలువురు అభినందలు కురిపించారు.

## జాతీయ అవార్డు సాధనకు కృషి

కలెక్టర్ భవేష్‌మిశ్రా



టేకుమట్ల(రేగొండ):చెన్నాపూర్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా



మొగుళ్లపల్లి: ఎంపీడీఓ కృష్ణవేణిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

టేకుమట్ల(రేగొండ): స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌లో జాతీయ అవార్డు సాధనకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. మంగళవారం రేగొండ మండలంలోని స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌లో ఎంపిక చేసిన చెన్నాపూర్‌లో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని వ్యక్తిగత, కమ్యూనిటీ మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, సీసీ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ పంచాయతీ భవనం, పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల అభ్యసన నైపుణ్యాలు, బోధనోపకరణాలు, డిజిటల్ తరగతి గదులను పర్యవేక్షించి, శిథిలావస్థకు చేరిన తరగతి గదులకు వెంటనే మరమ్మతులు చేపించాలని పంచాయతీ రాజ్ అధికారిని ఆదేశించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడా మైదానం, హరితహారంలో నాటిన మొక్కలను పరిశీలించారు. బృహత్ పల్లె ప్రకృతి వనంలో నాటిన మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌లో జాతీయస్థాయికి ఎన్నికైన గ్రామాలను అన్ని విధాలుగా తీర్చిదిద్దాలని చెప్పారు. వచ్చే వారంలో జాతీయస్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, టాయిలెట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట డీఆర్‌డీఓ పురుషోత్తం, ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ రాంప్రసాద్ రావు, సర్పంచ్, ఎంపీటీసీలు ఉన్నారు.


**పెండింగ్ పనులు పూర్తిచేయాలి**

మొగుళ్లపల్లి: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కింద జాతీయ అవార్డు సాధనకు కృషిచేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. మంగళవారం మండలంలోని మొట్లపల్లి గ్రామాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలోని పలు అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ పథకం అవార్డు కింద మొట్లపల్లి గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. వచ్చేవారంలో జాతీయస్థాయి అధికారులు వచ్చి గ్రామంలో క్షేత్రస్థాయి పరిశీలన చేస్తారని తెలిపారు. అప్పటిలోపు గ్రామంలో చిన్న చిన్న పనులను పూర్తి చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో డీఆర్‌డీఓ పురుషోత్తం , ఎంపీడీఓ కృష్ణవేణి, ఎంపీఓ వినోద్‌కుమార్, రాము, స్థానిక ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు, సర్పంచులు, పాల్గొన్నారు.

### నేటి విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

విద్యారణ్యపురి : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ పాఠశాలలో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సతీష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల చరణ్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి వెంకటరెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నరసింహారావు, ఏఐడీఎస్ఓ జిల్లా ఇన్‌చార్జ్ ఎ. సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణలో విఫలమైందని మండిపడ్డారు.

## పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



పోస్టర్ తయారీలో పాల్గొన్న విద్యార్థులు

భూపాలపల్లి అర్బన్: ప్రతి విద్యార్థి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని జిల్లా విద్యాశాఖ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేందర్ సూచించారు. ప్రపంచ జనాభా దినోత్సవం నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో జిల్లాస్థాయి పోస్టర్ తయారీ పోటీలు మంగళవారం నిర్వహించారు. అకాడమిక్ మానిటరింగ్ అధికారి కాగిత లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించగా ఏడీ రాజేందర్ మాట్లాడారు. విద్యార్థులు విద్య ద్వారా జ్ఞానాన్ని ఆర్జించి జ్ఞానంతో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. పర్యావరణ జీవనానికి హాని కలిగించే భౌతిక రసాయనిక జీవ సంబంధమైన పదార్థాలు అవసరానికి మించిన పరిమాణంలో వినియోగిస్తున్నట్లు తెలిపారు. దీంతో ప్రతిచోట వాటి సాంద్రత పెరిగి పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడి కాలుష్యం సంభవిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలని చెప్పారు. ప్లాస్టిక్‌ను వీలైనంత వరకు తగ్గించుకోవడానికి ప్రయత్నం చేయాలన్నారు. ఈ పోటీలలో జిల్లాలోని 11 మండలాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ కాటారం విద్యార్థి నవీన్ ప్రథమ బహుమతి రూ.500 నగదు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల మహదేవపూర్ విద్యార్థి పి.అంజలి రూ.300 నగదు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల బొమ్మపూర్ విద్యార్థి జె.వైశాలి తృతీయ బహుమతి రూ.200 నగదు అందించినట్లు ఏఎంఓ కాయిత లక్ష్మణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ భద్రయ్య, ఆర్ట్, క్రాఫ్ట్ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నరేష్, రంజిత్ కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సమ్మక్కసాగర్ బ్యారేజీ ఐదు గేట్లు ఓపెన్

కన్నాయిగూడెం: జిల్లాలోని తుపాకులగూడెం గ్రామం వద్ద గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ ఐదు గేట్లను అధికారులు మంగళవారం ఓపెన్ చేశారు. గత కొంత కాలంగా ఎగువ ప్రాంతం నుంచి బ్యారేజీలోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతుండడంతో సమ్మక్క సాగర్ బ్యారేజీ అంత నీటితో జలకళను సంతరించుకుంది. దీంతో మంగళవారం బ్యారేజీ ఇంజనీరింగ్ అధికారులు బ్యారేజీ వద్ద 59 గేట్లు ఉండగా అందులో 5 గేట్లను ఓపెన్ చేసి నీటిని దిగువకు వదులుతున్నారు. ఎగువ ప్రాంతం నుంచి బ్యారేజీలోకి 10,955 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండడంతో అదే మోతాదులో 5 గేట్లు ఎత్తి నీటిని బయటకు వదులుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజీలో 80 మీటర్ల నీటిమట్టం కొనసాగుతోంది.



బ్యారేజీ నుంచి గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్న నీరు

## కమిషనరేట్ పరిధిలో పోలీస్ అధికారుల బదిలీలు

**వరంగల్ క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

**ఇన్‌స్పెక్టర్లు..**

వెంకటరత్నం వీఆర్ నుంచి పరకాల, పి.కిషన్ పరకాల నుంచి వీఆర్, కె.రామకృష్ణ కాజీపేట ట్రాఫిక్ నుంచి గీసుగొండకు ఎస్.రాజు గీసుగొండ నుంచి వీఆర్‌కు బదిలీ చేశారు.

**సబ్ ఇన్‌స్పెక్టర్లు..**

డి.విజయ్‌కుమార్ హసన్‌పర్తి నుంచి రాయపర్తి, డి.రాజు వీఆర్ నుంచి టాస్క్‌ఫోర్స్, ఎల్.కొంరెల్లి కొడకండ్ల నుంచి ఇంతేజార్‌గంజ్, వి.నవీన్‌కుమార్ దుగ్గొండి నుంచి ఐనవోలు , జి.వెంకన్న ఐనవోలు నుంచి ఇంతేజార్‌గంజ్, ఈ.వీరభద్రరావు శాయంపేట నుంచి పర్వతగిరి, డి.దేవేందర్ పర్వతగిరి నుంచి కమలాపూర్, ఈ.నర్సింహారావు మడికొండ నుంచి టాస్క్‌ఫోర్స్, ఆర్.రణధీర్ కాజీపేట ట్రాఫిక్ నుంచి వరంగల్ ట్రాఫిక్, ఆర్.రామారావు వరంగల్ ట్రాఫిక్ నుంచి కాజీపేట, జే.నాగరాజు ఇంతేజార్‌గంజ్‌నుంచి స్టేషన్ ఘన్‌పూర్, వంశీకృష్ణ వీఆర్ నుంచి టాస్క్‌ఫోర్స్, కె.కిషోర్ వీఆర్ నుంచి హసన్‌పర్తి, వి.చరణ్‌కుమార్ కమలాపూర్ నుంచి వీఆర్, ఎండీ రవూఫ్ వీఆర్ నుంచి ఎస్సై -2 పాలకుర్తికి బదిలీ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆర్‌ఎఫ్‌ఓకు శౌర్య పతకం



గ్రేటర్ వరంగల్ ఆర్‌ఎఫ్‌ఓ పాపయ్య

**వరంగల్ అర్బన్ :** గ్రేటర్ వరంగల్ రీజినల్ ఫైర్ ఆఫీసర్(ఆర్‌ఎఫ్‌ఓ) వి.పాపయ్యకు రాష్ట్ర ప్రభుత్వం శౌర్య పతకం ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు వెల్లడించింది. సికింద్రాబాద్‌లోని డెక్కన్ మాల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో అసమాన ధైర్యం చూపి పలువురి ప్రాణాలను కాపాడిన నేపథ్యంలో పాపయ్యకు ప్రభుత్వం ప్రతిష్టాత్మక శౌర్య పతాక అవార్డును ప్రదానం చేయనుంది.

## లీడింగ్ ఫైర్‌మెన్ రవీందర్‌కు..



రవీందర్

**వరంగల్ :** వరంగల్ అగ్నిమాపక కేంద్రంలో లీడింగ్ ఫైర్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి.రవీందర్‌కు తెలంగాణ అగ్నిమాపక శాఖ ఉత్తమ సేవా పతకం ప్రకటించింది. 1987లో ఉద్యోగంలో చేరిన రవీందర్ 2017 సేవా పతకం అందుకున్నారు. ఇప్పటి వరకు 36 ఏళ్లుగా శాఖలో సేవలు అందించినందుకు ప్రభుత్వం ఉత్తమ సేవా పతకం ప్రకటించిందని డీఎఫ్‌ఓ భగవాన్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఉత్తమ సేవా పతకం అందుకున్న రవీందర్‌ను అధికారులు, ఉద్యోగులు అభినందించారు.



## తెలంగాణ అభివృద్ధిలో ఎన్‌ఆర్‌ఐలు కీలకం

- అమెరికా, ఇండియా వారధులు
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



అమెరికాలో సాయిదత్త ఆలయంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**పాలకుర్తి /దేవరుప్పుల :** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ఎన్‌ఆర్‌ఐలు కీలకమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రం ఫిలడెల్ఫియాలో 'తానా' సభలకు వెళ్లిన మంత్రి ఎర్రబెల్లి.. సాయి దత్త అలయాన్ని సందర్శించగా అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎన్‌ఆర్‌ఐ 'మీట్ అండ్ గ్రీట్' లో మాట్లాడుతూ ఉన్నత విద్య కోసం వచ్చి స్థిరపడిన ఎన్‌ఆర్‌ఐలు జన్మభూమిపై మమకారం చూపడం వల్లే దేశం, రాష్ట్రం పలు రంగాల్లో పురోగతి సాధిస్తున్నాయన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందని, మరింత అభివృద్ధి సాధించడానికి అమెరికా, ఇండియా వారధులుగా ఎన్‌ఆర్‌ఐలు తోడ్పాటు అందించాల్సి ఉందన్నారు.

**పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై ఎర్రబెల్లి ఆగ్రహం**

సీఎం కేసీఆర్.. రైతులకు ఉచితంగా 24 గంటల విద్యుత్ ఇస్తుంటే.. 3 గంటల విద్యుత్ చాలని అమెరికాలో పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలు చేపడుతుంటే హర్షించేదిపోయి ఎల్లలు దాటినా రాజకీయ ఉనికి కోసం అర్థరహిత విమర్శలు తగవన్నారు. రైతు పక్షపాతి పాలన కొనసాగిస్తున్న ఘనత దేశంలో సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

## లైబ్రరీకి ఆటోమేషన్ అవసరం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, పింగిళి కళాశాల ప్రిన్సిపాల్,తదితరులు

- కేయూ వీసీ ఆచార్య రమేశ్

**కేయూ క్యాంపస్:** ప్రతి కళాశాలకు లైబ్రరీ ఆటోమేషన్ అవసరమని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి కళాశాల లైబ్రరీ విభాగం, ఐక్యూఏసీ సంయుక్తంగా ఈఏడాది ఆగస్టు 4, 5 తేదీల్లో నిర్వహించనున్న రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్‌కు సంబంధించిన బ్రోచర్లను సోమవారం క్యాంపస్‌లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైబ్రరీ ఆటోమేషన్‌పై నిర్వహించే ఈవర్క్‌షాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యూనివర్సిటీ పరిధిలోని అన్ని లైబ్రరీల్లో ఆటోమేషన్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి మాట్లాడుతూ ఈవర్క్‌షాప్‌లో లైబ్రరీ ఆటోమేషన్ సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, కేయూ పాలక మండలి సభ్యులు నాగేంద్రబాబు, మల్లారెడ్డి, ప్రొఫెసర్ మనోహర్, రిటైర్డ్ ఆచార్యులు సుమతిఉమా మహేశ్వరి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత రచనారాజిరెడ్డి, పింగిళి కళాశాల పరీక్షల నియంత్రణాధికారి రామకృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని,లైబ్రేరియన్ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై వాహనాల తొలగింపు..

సాక్షి ఎఫెక్ట్..



వాహనాలను తొలగించడంతో విశాలంగా ఉన్న రహదారి

**వరంగల్:** వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌లో టమాట బాక్స్‌లను తీసుకొచ్చిన డీసీఎంలు రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలపడంతో వ్యాపారులు, వినియోగదారులు పడుతున్న ఇబ్బందులపై సోమవారం 'సాక్షి' దినపత్రికలో 'దారి చూపరూ' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి మార్కెట్ అధికారులు స్పందించారు. మంగళవారం మార్కెటింగ్‌శాఖ అధికారులు డీఎంవో ప్రసాదరావు, మార్కెట్ కమిటీ కార్యదర్శి బీవీ రాహుల్, గ్రేడ్-2 కార్యదర్శి రాములు సందర్శించి అడ్డుగా ఉన్న డీసీఎంలను తొలగించారు. ఈ సందర్భంగా డీఎంవో ప్రసాదరావు మాట్లాడుతూ కూరగాయల మార్కెట్‌లో వినియోగదారులు రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. టవర్ వద్ద నిలుపుతున్న వాహనాలతో పాటు రోడ్డుకు ఇరుపక్కల ఉన్న చిల్లర వ్యాపారులను సైతం క్రమబద్ధీకరిస్తున్నామన్నారు. రెండు రోజుల్లో చిల్లర వ్యాపారులు క్రమపద్ధతిలో విక్రయాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్.. రెండు గంటలు ఆలస్యం

- ఇబ్బందులు పడిన ప్రయాణికులు

**కాజీపేట రూరల్:** కాజీపేట జంక్షన్‌కు మంగళవారం రాత్రి సికింద్రాబాద్ నుంచి సిర్పూర్‌కాగజ్‌నగర్ వెళ్లే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రెండు గంటల ఆలస్యంతో చేరుకుంది. ఖమ్మం-విజయవాడ సెక్షన్‌లో రైల్వే ట్రాక్ మరమ్మతులు, మూడో లైన్ నిర్మాణం కారణంగా గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఉదయం గంట ఆలస్యంతో వెళ్లినట్లు రైల్వే అధికారులు తెలిపారు. గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌యే తిరిగి భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌గా వెళ్తుందని తెలిపారు. దీంతో భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం నిర్ణీత సమయం కన్నా సుమారు రెండు గంటల ఆసల్యంతో కాజీపేట జంక్షన్‌కు చేరుకుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## చేపల వేటకు వెళ్లి.. వృద్ధుడి మృతి

**కేసముద్రం:** చేపల వేటకు వెళ్లిన ఓ వృద్ధుడు.. సిమెంట్ పైపులైన్ కాలువలో ఊపిరాడక మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కోరుకొండపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన ఆనబత్తుల ఉప్పలయ్య(79) ఈనెల 6న చేపల వేటకు వెళ్లాడు. కాగా, చెరువు తూము సమీపంలో వేసిన సిమెంట్ పైపుల నుంచి నీళ్లు వెళ్తుంటాయి. ఈ క్రమంలో చేపలు పట్టేందుకు ఉప్పలయ్య ఆ సిమెంట్ పైపులైన్‌లోకి వెళ్లాడు. దీంతో ఊపిరాడక పైపులైన్‌లోనే మృతిచెందాడు. ఉప్పలయ్య తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికారు. మంగళవారం చెరువు వైపునకు వెళ్లిన స్థానికులకు దుర్వాసన రావడంతో కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు విజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

## నవాబ్ అలీ సేవలు చిరస్మరణీయం

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు



మాట్లాడుతున్న సీఎండీ గోపాల్‌రావు

**హన్మకొండ :** ఇంజనీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ సేవలు చిరస్మరణీయమని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్‌రావు అన్నారు. నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ఇంజనీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ 146వ జయంతిని మంగళవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎండీ గోపాల్‌రావు.. నవాబ్ అలీ నవాజ్ జంగ్ చిత్రపటానికి పూలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నవాబ్‌అలీ నవాజ్ జంగ్ బహదూర్ పుట్టిన రోజును తెలంగాణ ఇంజనీర్స్‌డే గా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. తెలంగాణ చీఫ్ ఇంజనీర్‌గా ఉన్న కాలంలో ఆయన అనేక భారీ నీటిపారుదల ప్రాజెక్టులకు రూపకల్పన చేసి, వాటిని విజయవంతంగా నిర్మించారన్నారు. హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చే హిమయత్ సాగర్, ఓయూ ఆర్ట్స్ కాలేజీ, ఉస్మానియా హాస్పిటల్, జూబ్లీహాల్, ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్ తదితర ఎన్నో చరిత్రాత్మక నిర్మాణాలను చేపట్టారని గుర్తుచేశారు. గోదావరి, మంజీరా నదులపై వంతెనల నిర్మాణాల్లో కీలక పాత్ర పోషించారని, అలాగే టెలిఫోన్ సౌకర్యం జిల్లాలకు విస్తరించేందుకు ఆయన చూపించిన చొరవ ఎనలేనిదన్నారు. నవాబ్‌అలీ జంగ్‌ను స్ఫూర్తిగా తీసుకొని వినియోగదారులకు సంస్థలోని ప్రతి ఉద్యోగి నాణ్యమైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వరావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, వి.తిరుపతిరెడ్డి, సీజీఎంలు టి.సదర్‌లాల్, అశోక్‌కుమార్, టి.మధుసూదన్, మోహన్‌రావు, కిషన్, సి.ప్రభాకర్, రవీంద్రనాథ్, రాజు చౌహాన్, కెఎస్ గుట్ట, బికం సింగ్, జాయింట్ సెక్రటరీ కె.రమేశ్, జీఎంలు శ్రవణ్‌కుమార్, నాగప్రసాద్, గిరిధర్, వేణుబాబు, శ్రీకృష్ణ, సత్యనారాయణ, మనోహర స్వామి, దేవేందర్, వేణుబాబు, అన్నపూర్ణ, సత్యనారాయణ, కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## ఓపీఎస్ అమలు చేయాలి

- వరంగల్ మార్కెట్ కమిటీ ఎస్‌జీఎస్ బీవీ రాహుల్



పోస్టర్లతో నిరసన తెలుపుతున్న మార్కెట్ ఉద్యోగులు

**వరంగల్ :** మార్కెట్ ఉద్యోగులకు కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను అమలు చేయాలని వరంగల్ మార్కెట్ కమిటీ ఎస్‌జీఎస్ బీవీ రాహుల్ అన్నారు. ఈమేరకు మంగళవారం వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయం ఎదుట ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఉద్యోగులందరికీ ఓపీఎస్ అమలు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేశాయన్నారు. అదే విధంగా తెలంగాణలో కూడా ఉద్యోగులకు ఓపీఎస్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం టీఎన్‌జీఓస్(మార్కెటింగ్) జిల్లా అధ్యక్షుడు జన్ను భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు మామిండ్ల రాజేందర్, కార్యదర్శి జ్ఞానేశ్వర్ ఆదేశాల మేరకు ఈ నిరసన చేపట్టామన్నారు. కార్యక్రమంలో కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు పి.అశోక్, వరంగల్ ఉమ్మడి జిల్లా నాయకులు ఎండీ బియబానీ, రాము, కృష్ణమీనన్‌రావు, శ్రీనివాస్‌రాజ్, నర్సింహానాయక్, కుమార్, కన్నయ్య, రమణ, స్వప్న, రాజేశ్వరి, పద్మ, లత తదితరులు పాల్గొన్నారు.

## అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు



**ములుగు:** టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వాక్యాలను బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించి అసత్య ప్రచారానికి తెరలేపారని ఎమ్మెల్యే సీతక్క మండిపడ్డారు. మంగళవారం సీతక్క ఫోన్ లో మీడియాతో మాట్లాడారు. దేశంలోనే మొదటి సారిగా రైతులకు ఉచిత కరెంట్ ఇచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. బీఆర్‌ఎస్ నేతలు లేనిపోని తప్పుడు ప్రచారాలను సృష్టించి మరో సారి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారనీ అన్నారు. రైతులకు ఏక కాలంలో రైతు రుణమాఫీ చేస్తాం అని మోసం చేసింది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారం లోకి రాగానే రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ప్రకటించమని గుర్తు చేశారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమన్నారు. బీఆర్‌ఎస్ నాయకులకు కుక్కకు బొక్క దొరికినట్లు వ్యవహరించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అమెరికాలో రేవంత్‌రెడ్డి రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం కాదు నాణ్యమైన 8 గంటల విద్యుత్ ఇస్తే సరిపోతుందనే వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించారని ఆమె ఆరోపించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని రాబోవు రోజుల్లో గుణపాఠం తప్పదన్నారు.



## ఆవేదనతో అనంతలోకాలకు..

- వేర్వేరు కారణాలతో ముగ్గురి బలవన్మరణం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివిధ కారణాలతో మనస్తాపం చెందిన ముగ్గురు మంగళవారం బలవర్మణం చెందారు. నర్సంపేట మండలం రాజుపేట శివారులో వ్యక్తి , కేసముద్రం మండలం ఇంటికన్నెలో యువకుడు, రేగొండ మండలం కనిపర్తిలో యువతి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

**ఇంటికన్నెలో యువకుడు..**



ప్రేమ్‌సాగర్(ఫైల్)

**కేసముద్రం:** మానసిక సమస్యతో బాధపడుతున్న ఓ యువకుడు.. జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని ఇంటికన్నె రైల్వేస్టేషన్‌లో జరిగింది. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ రాజు కథనం ప్రకారం వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేట గ్రామానికి చెందిన జెళ్ల యాకయ్య, ఉమ దంపతులకు కుమారుడు ప్రేమ్‌సాగర్(23), కూతురు ఉంది. ఇంటర్ వరకు చదువుకున్న ప్రేమ్‌సాగర్ కొద్దిరోజుల నుంచి మానసిక సమస్యతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆ యువకుడు.. మంగళవారం ఇంటికన్నె-నెక్కొండ రైల్వేస్టేషన్ల మధ్య 415/23-15 కిలోమీటర్ వద్ద అప్‌లైన్‌లో వెళ్తున్న గుర్తుతెలియని రైలు కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, మృతుడి శరీరభాగాలు చిద్రమై రైల్వేట్రాక్‌పై అక్కడక్కడ పడ్డాయి. ఘటనా స్థలికి చేరుకున్న జీఆర్‌పీ పోలీసులు శవ పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

**నర్సంపేట మండలం రాజుపేట శివారులో వ్యక్తి..**



బుచ్చిరెడ్డి (ఫైల్)

**నర్సంపేట రూరల్ :** పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన నర్సంపేట మండలం రాజుపేట శివారులో జరిగింది. నల్లబెల్లి మండలం మామిండ్ల వీరయ్యపల్లి గ్రామానికి చెందిన ముసుగు బుచ్చిరెడ్డి (50) తనకున్న రెండున్నర ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో తరుచూ దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం కూడా జరగడంతో బచ్చిరెడ్డి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. మంగళవారం సాయంత్రం నర్సంపేట మండలం రాజుపేట శివారులో పురుగుల మందు తాగి పడిపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలికి చేరుకుని బుచ్చిరెడ్డిని నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. కాగా, మృతుడికి భార్య కవిత, ఇద్దరు కుమారులు అనిల్, హరీశ్ ఉన్నారు.

**కనిపర్తిలో యువతి..**



రమ్య(ఫైల్)

**టేకుమట్ల(రేగొండ):** ఉరివేసుకుని ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కనిపర్తిలో జరిగింది. గ్రామానికి చెందిన పడకంటి రాజు, రజిత దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు రమ్య(22) ఉన్నారు. కాగా, రమ్య పరకాలలోని వాగ్దేవి కాలేజీలో బీఈడీ చదువుతోంది. ఈ క్రమంలో నాలుగు నెలల కిత్రం తండ్రి రాజు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే, రమ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రుల్లో చికిత్స అందించినా నయం కావడం లేదు. దీంతో తండ్రి లేక.. తల్లి, సోదరులను ఆర్థికంగా ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక మంగళవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై మృతురాలి తల్లి రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

## గుప్త నిధుల కోసం తవ్వకాలు..



గుప్తనిధుల కోసం గుట్టపై తవ్విన గొయ్యి

**డోర్నకల్:** మండలంలోని ముల్కలపల్లి శివారు పాండవుల గుట్టపై గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. ఈ ఘటన గ్రామంలో కలకలం సృష్టించింది. వర్షాలు కురవాలని కోరుకుంటూ ముదిరాజ్ కులస్తులు.. పాండవుల గుట్టపై తరచూ పూజలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా సోమవారం గుట్ట సమీపంలోకి కొందరు యువకులు వెళ్లగా తవ్వకాలు జరుపుతున్నట్లు శబ్ద వినపడింది. దీంతో గ్రామస్తులకు సమాచారం అందించగా వారు గుట్టపైకి చేరుకున్నారు. కొంతమంది పారిపోగా ఇద్దరు వ్యక్తులు, ఆటో, ద్విచక్ర వాహనం పట్టుబడ్డాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలికి చేరుకుని వాహనాలతో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఘటనాస్థలాన్ని పరిశీలించగా వారం రోజుల నుంచి తవ్వకాలు జరుపుతున్నట్లు కనిపించింది. దీనిపై సీఐ ఉపేందర్‌రావును వివరణ కోరగా గుట్టపై గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపింది వాస్తవమేనన్నారు. తమ సిబ్బంది ఘటనా స్థలికి వెళ్లి ప్రాథమికంగా విచారణ జరిపారన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే పూర్తిస్థాయిలో విచారణ చేపడుతామని సీఐ తెలిపారు.

## అదుపు తప్పి వాగులోకి దూసుకెళ్లిన కారు..

- వర్ధన్నపేట ఎస్సైకి తప్పిన పెను ప్రమాదం



ఆకేరు వాగులోకి దూసుకెళ్లిన కారు

**వర్ధన్నపేట:** వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్‌కు పెనుప్రమాదం తప్పింది. విధుల నిమిత్తం మంగళవారం తన సొంత కారులో డ్రైవ్ చేసుకుంటూ వరంగల్‌లోని తన నివాసం నుంచి వర్ధన్నపేటకు వస్తున్నాడు. ఈ క్రమంలో ఆకేరు వాగు బ్రిడ్జి ప్రారంభంలో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై కుక్క అడ్డు వచ్చింది. దీనిని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి వాగులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో బెలూన్ ఓపెన్ కావడంతో ఆయన ప్రమాదం నుంచి తృటిలో బయటపడ్డారు. కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది.

## దైవదర్శనానికి వెళ్లేందుకు వచ్చి.. మృత్యుఒడికి

- రెండు బైక్‌లు ఢీ
- ఒకరు దుర్మరణం.. ముగ్గురికి తీవ్ర గాయాలు



కిరణ్ మృతదేహం

**నల్లబెల్లి:** దైవ దర్శనానికి వెళ్లేందుకు అత్తారింటికి వచ్చిన ఓ వ్యక్తి.. రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందగా ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం మండలంలోని నందిగామ శివారులో జరిగింది. గీసుగొండ మండలం మొగిలిచర్లకు చెందిన బండారి కిరణ్(24) దంపతులు బతుకుదెరువు నిమిత్తం చెన్నైకి వెళ్లారు. ఈ క్రమంలో వేములవాడ వెళ్లేందుకు మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి అత్తారింటికి వచ్చాడు. దైవదర్శనానికి అవసరమైన సామగ్రి తెచ్చుకునేందుకు తన వద్ద పనిచేసే ఆదిలాబాద్‌కు చెందిన వేముల ప్రశాంత్‌తో కలిసి బైక్‌పై మండల కేంద్రానికి వెళ్లి తిరిగి నందిగామకు వస్తున్నాడు. ఈ క్రమంలో నందిగామ శివారులోని సబ్ స్టేషన్ వద్ద.. రేలకుంట గ్రామానికి చెందిన అక్కపల్లి అజయ్, కొత్తురు భిక్షపతి ద్విచక్రవాహనపై నల్లబెల్లి వైపు వస్తున్నారు. ఈక్రమంలో ఇరువురి బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కిరణ్ అక్కడికక్కడే మృతి చెందగా ప్రశాంత్, అజయ్, భిక్షపతికి తీవ్రగాయాలయ్యాయి. ఘటనా స్థలికి పోలీసులు చేరుకుని మృతహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్ నగేశ్ తెలిపారు.

## ఆ పాప ఎవరు..? కథనంపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..



విచారణ చేస్తున్న అధికారులు

**కాశీబుగ్గ సెంటర్:** అమెరికా దంపతులు..వరంగల్‌కు చెందిన ఓ ఆరేళ్ల శిశువును దత్తత తీసుకునే అంశంపై మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సీడబ్ల్యూసీ సభ్యులు, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు, ఏహెచ్‌టీయూ పోలీస్ , ఐసీడీఎస్ సూపర్‌వైజర్.. వరంగల్ పిన్నవారి వీధిలో ఉంటున్న ఆ కుటుంబం వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. వారి సమాచారం మేరకు వరంగల్ ములుగు రోడ్డులోని 'రియా' ఆస్పత్రిలో పాప బర్త్ వివరాలు, రికార్డులను తనిఖీ చేయగా అందుకు సంబంధించిన వివరాలు లేకపోవడంతో బుధవారం సీడబ్ల్యూసీ ఎదుట హాజరు కావాలని ఆదేశించినట్లు సమాచారం.